సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024





ఎంపీ స్థానం సంఖ్య '4'

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం క్రమ సంఖ్యను 4గా ఎన్నికల సంఘం గుర్తించింది. గతంలో 34గా ఉండేది.

- 8లో ▸



ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ఆపమన్న చోట బస్సు నిలపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాడికి పాల్పడ్డాడు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.3 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నామినేషన్ దాఖలు చేయని జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయడానికి సిద్ధం చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేయాలని భావించారు. నామినేషన్లను అధికారులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2.50 గంటలకు జిల్లాకు రావడంతో నామినేషన్ వేయడానికి వీలుకాలేదు. దీంతో నామినేషన్ వేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది.

ముగిసిన పరీక్షలు

- రేపటి నుంచి వేసవి సెలవులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో విద్యార్థులకు 15వ తేదీన ప్రారంభమైన సమ్మెటివ్–2 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. దీంతో బు ధవారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డు లు అందజేస్తారు. అలాగే తల్లిదండ్రుల కమి టీ సమావేశాలు నిర్వహించనున్నారు. వేస వి సెలవులు బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు ఉంటాయి. అనంతరం జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.

డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి



సాక్షి, కామారెడ్డి: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఇన్‌చార్జి చైర్మన్‌గా బీబీపేటకు చెందిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏదుల ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా సహకార శాఖ అధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న సంబారి మోహన్ తన పదవికి రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డిని నియమించారు.

అకాల వర్షంతో అతలాకుతలం



సాక్షి, కామారెడ్డి: జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో జనం ఇబ్బందిపడ్డారు. జిల్లా కేంద్రంలో భారీ వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కామారెడ్డి, లింగంపేట, మాచారెడ్డి, దోమకొండ, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, రామారెడ్డి తదితర మండలాల్లో వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయి మరింత నష్టం వాటిల్లింది. బలమైన గాలులకు పలుచోట్ల చెట్టు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దోమకొండలో పిడుగుపడడంతో కొబ్బరిచెట్టు కాలిపోయింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

తెలంగాణలో క్లీన్‌స్వీప్ చేస్తాం



సంగారెడ్డి: మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పారు. దేశంలో ఎన్డీయే కూటమి 400లకుపైగా ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎప్పటికీ ప్రధాని కాలేరన్నారు. ఈ ఎన్నికలతో ఆ పార్టీ శకం ముగుస్తుందన్నారు. మోదీ దేశ ప్రజలకు గ్యారంటీ కార్డు అన్నారు. ఆయన మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాన్ని పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసిన బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జనజాతర సభలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలు



సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డే వ్యవసాయ మంత్రి!

- రైతాంగ సమస్యలపై పోరాడేందుకే నిజామాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు
- షుగర్ ఫ్యాక్టరీ పేరిట కవిత రైతులను మోసగించారు
- ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు హామీని నెరవేర్చలేదు
- పసుపుబోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారో స్పష్టత లేదు
- రైతులను మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలి
- జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో ఏర్పడే ఇండియా కూటమి ప్రభుత్వంలో కేంద్ర వ్యవసాయ మంత్రిని చేసే బాధ్యత నాదేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రిగా పసుపుబోర్డు తీసుకువస్తారని పేర్కొన్నారు. ఒకవేళ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోరాటం చేసి పసుపు బోర్డు తెస్తారన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన జనజాతర సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఓటములు గెలుపునకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. కేసీఆర్ కొడంగల్‌లో కక్ష గట్టి వందల మంది పోలీసులతో అరెస్టు చేసి తనను అణగదొక్కడానికి ప్రయత్నించినట్లు గుర్తుచేశారు.

ఎమ్మెల్యేగా ఓటమి చెందిన మూడునెలల్లోనే మల్కాజ్‌గిరిలో పోటీచేసి గెలుపొందానన్నారు. సమస్యలపై పార్లమెంట్ పోరాటం చేయడంతో రాహుల్‌గాంధీ తనను పీసీసీ అధ్యక్షుడి చేశారని తెలిపారు. మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి చెందారని పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందుతారని, దీంతో కేంద్రమంత్రి పదవి లభిస్తుందన్నారు.

ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని..

2014 ఎన్నికల్లో ప్రజలు తనను గెలిపిస్తే వంద రోజుల్లో నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని కవిత హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వరి, ఎర్రజొన్న, పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పి ఐదేళ్లు మోసం చేశారన్నారు. దీంతో 178 మంది రైతులు 2019 ఎన్నికల్లో పోటీ చేసి కవితను ఓడించారని పేర్కొన్నారు. అప్పుడు ఎంపీగా అర్వింద్‌ను గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపుబోర్డు తీసుకువస్తానని బాండ్‌పేపర్ రాసిచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయకుండా ఆయన కూడా రైతులు మోసం చేశారన్నారు. ప్రధాని బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఎక్కడ ఏర్పాటు చేస్తామనే స్పష్టత ఇవ్వలేదన్నారు. స్పైసిస్ బోర్డు ఏర్పాటు చేసి.. పసుపు బోర్డు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మరో కొత్త నాటకానికి తెర తీశారని విమర్శించారు. తమను నిర్లక్ష్యం చేసిన వారికి రైతులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. స్వయంగా రైతు అయిన జీవన్‌రెడ్డి గెలిపిస్తే రైతాంగం సమస్యలను పరిష్కరిస్తారని.. అందుకోసం ఆయన నిజామాబాద్ నుంచి పోటీ చేస్తున్నారని తెలిపారు. పంజాబ్, హర్యానా రైతులు కేంద్రం తెచ్చిన నల్లచట్టాలపై 16 నెలలపాటు పోరాటం చేశారని గుర్తు చేశారు. దీంతో కేంద్రం చట్టాలపై వెనక్కి తగ్గిందన్నారు. అంతటి ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం గల రైతులు ఈ ప్రాంత రైతులని పేర్కొన్నారు. ఇందూరు రైతులకు పంటలు ఎలా పండించాలో తెలుసునని.. అలాగే రైతులను పట్టించుకోని పార్టీలకు ఎలా వాతలు పెట్టాలో కూడా తెలుసునన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం

నిజాం షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17లోపు తెరిపిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఇందుకోసం సబ్ కమిటీ వేశామని.. మంత్రి శ్రీధర్‌బాబు రైతులను కలిసి మాట్లాడారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఫ్యాక్టరీలను తెరిపించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఆద్లూరి లక్ష్మణ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు రవీందర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, ఆరికెల నర్సారెడ్డి, ఆకు ల లలిత, కాంగ్రెస్ నగరాధ్యక్షుడు కేశవేణు, కాంగ్రెస్ నేతలు బాడ్సి శేఖర్ గౌడ్, డాక్టర్ కవితారెడ్డి, ఏబీ శ్రీనివాస్‌రెడ్డి(చిన్నా), పూర్ణచందర్‌రావు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ

'నా తెలంగాణ, కోటి రతనాల వీణ' అని దాశరథి ఇందూరు జైలు గోడలపై రాసి తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నారాయణరెడ్డిది కూడా ఈ గడ్డనేన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం బంగారం అమ్మి ఇచ్చిన సదాలక్ష్మి ఈ గడ్డకు చెందిన మహిళేనన్నారు. ఈశ్వరీబాయి, అర్గుల్ రాజారాం లాంటి నేతలు ఈ ప్రాంతానికి చెందినవారేనన్నారు. జాతీయస్థాయిలో రాణిస్తున్న మాలావత్ పూర్ణ, బాక్సర్ నిఖత్ జరీన్ కూడా నిజామాబాద్‌వాసులేని చెప్పారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం



నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యధిక సంఖ్యలో రైతులు, గల్ఫ్ కార్మికులు ఉంటారని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులను బీఆర్ఎస్, బీజేపీలు పట్టించుకోలేదన్నారు. పసుపుబోర్డుపై అర్వింద్ ఉత్తర్వులతో సరిపెట్టారని వ్యాఖ్యానించారు. గల్ఫ్ కార్మికులు మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ. 5 లక్షల పరిహారం అందిస్తామని తెలిపారు. ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌లో ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. పసుపుబోర్డు నిజామాబాద్‌లో ఏర్పా టు చేస్తారా లేక అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేస్తా రా స్పష్టం చేయాల్సిన బాధ్యత అర్వింద్, బీజేపీపై ఉందన్నారు. గతంలో పసుపు క్వింటాలు అమ్మితే రైతు తులం బంగారం కొనుగోలు చేసేవారని, ఇప్పుడు క్వింటాలు పసుపు ధర రూ. 15వేలు ఉందన్నారు. నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



సీఎం రేవంత్‌రెడ్డికి గొంగడి, నాగలి, గొర్రె పిల్లను అందజేస్తున్న నాయకులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మెమోరాండం ఇస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

నాలుగో రోజు 12 నామినేషన్లు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గానికి సోమవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్‌లు తమ మూడో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థి ఆర్ రాజేందర్, రాపెల్లి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థి సయ్యద్ అస్గర్ రెండో సెట్ నామినేషన్‌లు వేశారు. అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థి యుగంధర్ గట్ల, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థి పోతు అశోక్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విట్టల్ మలావత్, స్వతంత్ర అభ్యర్థి కాట్రాజి ప్రశాంత్, యుగ తులసి పార్టీ అభ్యర్థి కోటగిరి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 28 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

జహీరాబాద్‌లో తొమ్మిది..

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. ఆయన వెంట కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరఫున పార్టీ నాయకులు ఒక సెట్ నామినేషన్ వేశారు. టీపీఎస్ అభ్యర్థిగా కొత్త బలిజ బస్వరాజ్ రెండు సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మాలెపు మోహన్‌రెడ్డి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా రవి మహాదేవ్ స్వామి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా గంగారాం, రమేశ్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్‌లు దాఖలు చేశారు.

పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప పనులు చేపట్టాలి

- తెయూ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి
- సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి రూరల్ ఎమ్మెల్యే వినతి




సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 21, 21ఏ ప్యాకేజీ పనులకు చెందిన పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టు పనులు కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విన్నవించారు. సోమవారం నగరంలోని నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే రూరల్ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి నిధుల మంజూరుపై సీఎంకు వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు పెండింగ్ పనుల పూర్తికి సుమారు రూ.300 కోట్లు నిధులను తక్షణం మంజూరు చేయాలన్నారు. గుత్ప ఎత్తిపోతల కొనసాగింపు పథకం ద్వారా 8 గ్రామాలు, సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ప్రాజెక్టు పెండింగ్ పనులకు రూ.10 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. నుడా పరిధిలోని గ్రామాలను అనుసంధానిస్తూ ఇన్నర్ రింగ్‌రోడ్డును కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటుతో పాటు అదనపు కోర్సులు, వర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వాణిజ్య పంటలకు ఉపయుక్తమయ్యే ఇండస్ట్రియల్ సెజ్, డ్రైపోర్టును ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లాలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాల సమస్యలను పరిష్కరించాలని, టీఎస్ బీపాస్‌లో మార్పులు చేయాలని విన్నవించారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఇందూరు జిల్లాలో టూరిజం అభివృద్ధి చేయాలని సీఎంను కోరారు.

అడిగినంత ఇవ్వాల్సిందే..!

- అటవీ శాఖలో ఓ డివిజన్ స్థాయి అధికారిపై ఆరోపణలు
- టింబర్ డిపోలు, సామిల్లుల్లో అక్రమ వసూళ్లు
- ముడుపులివ్వకుంటే 'నోటీసులతో' ముప్పుతిప్పలు
- రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసిన బాధిత వ్యాపారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీశాఖలో ఒక డివిజన్ స్థాయి అధికారి పనితీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. టింబర్ డిపోలు, సామిల్లుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు అవినీతి ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే, ఇటీవల సదరు అధికారిపై వ్యాపార యజమానులు ఏకంగా రాష్ట్ర శాఖకు ఫిర్యాదు చేయడం ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఆఫీసర్ తీరుతో ఇబ్బందులకు గురవుతున్నామని, ఏదో ఒక వంక చూపి నోటీసులతో తమను ముప్పతిప్పలు పెడుతున్నాడని రాష్ట్ర ఉన్నతాధికారుల ముందు వాపోయినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు జిల్లా అట వీ శాఖ అధికారి(డీఎఫ్‌వో) వికాస్ మీనా దృష్టికి తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో డీఎఫ్‌వో సదరు అధికారిని పిలిపించి మందలించినట్లు ఫారెస్టు శాఖలో ప్రచారం జరుగుతోంది. డివిజన్‌స్థాయి అధికారితో వ్యాపారులే కాకుండా శాఖలో పనిచేస్తున్న కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. 'బాసిజాన్ని' ప్రదర్శిస్తున్నాడని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రెన్యూవల్ వచ్చిందంటే పండుగే..

జిల్లా వ్యాప్తంగా టింబర్ దుకాణాలు, సామిల్లులు, కార్పెంటర్ షాపులను వ్యాపారులు అటవీశాఖ నుంచి అనుమతి తీసుకుని కట్టె వ్యాపారం చేస్తున్నారు. వీరు అటవీ శాఖ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రతి ఏడాది దుకాణ లైసెన్సులు మార్చి–ఏప్రిల్ నెలల్లో రెన్యూవల్ చేసుకోవాలి. లైసెన్సుల పునరుద్ధరణకు వ్యాపారులు రూ. 5వేలతో చాలన్ తీసి అటవీ శాఖ అధికారులకు అందజేస్తారు. చాలన్ కట్టినప్పటికీ అటవీ అధికారులు టింబర్ డిపోలు, సామిల్లులు, కార్పెంటర్ దుకాణాలను ప్రత్యక్షంగా తనిఖీ చేస్తారు. తనిఖీల్లో కట్టె నిల్వలు, అమ్మకాలు, మిగులు సరుకును పరిశీలిస్తారు. అంతా సవ్యంగా ఉంటేనే లైసెన్సు రెన్యూవల్ జరుగుతుంది. అయితే, ఇదంతా కళ్ల ముందు జరిగే వ్యవహారం. చాటున జరిగే చేయి తడిపే కార్యక్రమాలు వేరే ఉంటాయి. లైసెన్సుల రెన్యూవల్ వచ్చిందంటే అటవీ శాఖలో కొందరు అధికారులకు పండుగేనని చెప్పవచ్చు. అధికారుల చల్లని చూపు తమపై ఎల్లప్పుడు ఉండేందుకు వ్యాపారులు వేలల్లో ముడుపులు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, ఇందులో ఓ ఉన్నతాధికారి ప్రవర్తన తీరు మితిమీరింది. మీరు ఇచ్చినంత కాదు, నేను అడిగినంత ఇవ్వాలని వ్యాపారులకు హుకూం జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అడిగినంత ఇవ్వకపోతే ఇటీవల సంబంధిత టింబర్ డిపోలు, సామిల్లులను తనిఖీలు చేసి ఏదో ఒక తప్పును వెతికి మరీ వ్యాపారులకు నోటీసులు జారీ చేశారని విమర్శలున్నాయి. వసూళ్ల పర్వంలో ఒక కంప్యూటర్ కీరోల్‌గా పనిచేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. సదరు అధికారి తీరుతో విసిగిపోయిన బాధిత వ్యాపారులు హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులను కలిసిన విషయం ఆలస్యంగా బయటకు పొక్కింది. అటవీ శాఖలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

విచారణ చేపడతాం

లైసెన్సు రెన్యూవల్ పేరుతో అటవీ అధికారులు డబ్బులు వసూలు చేసినట్లు వ్యాపారుల నుంచి ఫిర్యాదులు అందలేదు. కానీ, ఒక అధికారి నిబంధనల పేరుతో నోటీసులిచ్చినట్లు సమాచారం వచ్చింది. నిబంధనలు పాటించని వారికి నోటీసులివ్వడం సాధారణమే. కానీ దానిని అడ్డుపెట్టుకుని వారి వద్ద డబ్బులు డిమాండ్ చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవు. వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడతాం.

– వికాస్‌మీనా, జిల్లా అటవీ శాఖ అధికారి

రైతులను అప్రమత్తం చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

నిజామాబాద్‌రూరల్ : రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని.. అధికారులు రైతులను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ సూచించారు. సోమవారం వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, పౌర సరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఒకవేళ ధాన్యం తడిచినా రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కమిషనర్ పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టిన తర్వాత కేంద్రాల ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో సివిల్ సప్లయ్స్ డీఎం జగదీశ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగవ్వ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షలకు 865 మంది విద్యార్థులకు గాను 826 మంది హాజరుకాగా, 39 మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

వాటాధనం వెనక్కి

డొంకేశ్వర్(ఆర్మూర్): గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన గొల్ల, కుర్మ, యాదవులకు జీవాలు అందకపోవడంతో వాటాధనాన్ని అధికారులు వెనక్కి ఇచ్చేశారు. జిల్లాలో సుమారు 1,071 మందికి గొర్రెలు అందలేదు. దీంతో తాము చెల్లించిన డబ్బులు తిరిగివ్వాలని పశుసంవర్ధక శాఖకు చాలా మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతగా 282 మందికి రూ.1.23కోట్లు చెల్లించేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నారు. డీడీలు కట్టిన వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించి ఒక్కో లబ్ధిదారుడికి రూ.43,750 చెల్లించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి తెలిపారు. మిగిలిన వారు కూడా తాము చెల్లించిన వాటా ధనాన్ని వెనక్కి ఇవ్వాలని అధికారులకుదరఖాస్తుచేసుకుంటున్నారు.

బీజేపీ వైఫల్యాలను వివరించాలి



రాజంపేట : బీజేపీ వైఫల్యాలు, బీబీపాటిల్ అక్రమాలు ప్రజలకు తెలియజేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ కార్యకర్తలను ఆదేశించారు. సోమవారం ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలంలోని ఆయా గ్రామాల అధ్యక్షులతో, యూత్ అధ్యక్షులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరితో నేరుగా రివ్యూ చేసి ఇప్పటిదాకా ఎన్ని ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చేలా కృషి చేశారనే విషయాన్ని తెలుసుకున్నారు. మండల సమావేశాల్లో చెప్పిన పనులను పూర్తి చేయని వారిని తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సుమారుగా తమ వ్యక్తి గతంగా 50 నుండి 60 ఓట్లు తమ బాధ్యతగా తీసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం బస్వాపనపల్లి, ఆర్గోండ, కొండాపూర్, గుండారం, సిద్ధాపూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన వ్యక్తి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జానజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డితోపాటు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రసంగించారు. జీవన్‌రెడ్డి గెలిస్తే పసుపు బోర్డుకు పరిష్కారం లభిస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు జీవన్‌రెడ్డికి సరిరారని, ఆయన నిబద్ధత కలిగిన వ్యక్తి అనిఅన్నారు. లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు.


సభకు హాజరైన మహిళలు

జీవన్‌రెడ్డితోనే పసుపుబోర్డు సమస్యకు పరిష్కారం

జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తేనే పసుపుబోర్డు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. నల్లచట్టాలు, జీఎస్టీతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోదీ నిరంకుశపాలనకు చరమగీతంపాడుదాం. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.
– సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే

అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు

ఎంపీగా కేసీఆర్ కుతూరు కవిత ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కవిత మాదిరిగానే ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు. పసుపుబోర్డుతోపాటు జిల్లా అభివృద్ధికి నిధులు తీసుకురాలేదు. డీఎస్ ముఖం చూసి గెలిపించాలని గతంలో కోరిన అర్వింద్.. ఇప్పుడు మోదీ ముఖం చూసి గెలిపించాలని అంటున్నాడు. జీవన్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలి. ఆయన గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారు. – భూపతిరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వైఎస్సార్ తర్వాత రేవంత్‌రెడ్డి..

రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత జిల్లాకు రావడం మొదటిసారి. రేవంత్‌రెడ్డి కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ తర్వాత రేవంత్‌రెడ్డికే కాంగ్రెస్‌లో అవకాశం దక్కింది. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నిబద్ధత కలిగిన వ్యక్తి. ఎంపీ అర్వింద్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్.. జీవన్‌రెడ్డికి సరిరారు.
– బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది

మోదీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది. 42 శాతం ముస్లింలు ఉన్నారని చెప్పారు. సంసారం తెలియని మోదీకి ప్రజల సమస్యలు ఏమి తెలుస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 90 రోజుల్లో 31 వేల ఉద్యోగాలు ఇచ్చింది. మోదీ ప్రభు త్వం కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కనీసం 10 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. – షబ్బీర్‌అలీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు


వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు


సభ ఫొటోలు తీస్తున్న యువతి


నామినేషన్ కోసం జీవన్‌రెడ్డికి డబ్బులు అందజేస్తున్న హనుమాన్ మాలధారులు


సీఎం రేవంత్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి ముచ్చట


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న హనుమాన్ మాలధారులు

జనజాతర సైడ్‌లైట్స్

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సభకు సంబంధించిన సైడ్‌లైట్స్..

- మధ్యాహ్నం 2:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయాణించిన హెలీక్యాప్టర్ గిరిరాజ్ కళాశాల మైదానంలో ల్యాండ్ అయ్యింది.
- కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సీఎంకు స్వాగతం పలికారు.
- సీఎం కాన్వాయ్ కంఠేశ్వర్ చౌరస్తా, కంఠేశ్వర్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్‌కు చేరుకుంది.
- అడుగడుగునా ట్రాఫిక్‌ను నియంత్రించిన పోలీసులు.. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ ప్రాంతం నుంచి వచ్చిన వాహనాలను సీఎస్‌ఐ కళాశాల మైదానంలో, బోధన్, నిజామాబాద్ అర్బన్ నుంచి వచ్చిన వాహనాలను ప్రెస్‌క్లబ్ ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంతోపాటు పాత కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేయించారు.
- 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.
- జనజాతరసభలో పోలీసులు ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు మఫ్టీలో బందోబస్తు నిర్వహించారు.
- సభాస్థలి వద్దకు పోలీసులు ఎవరిని అనుమతించలేదు. పాస్‌ల ఆధారంగానే స్టేజీపైకి నేతలను అనుమతించారు.



- కళాకారులు పాడిన పాటలకు కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేశారు.
- మధ్యాహన్నం 2:50 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సభాప్రాంగణానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. సీఎం వారికి అభివాదం చేశారు.
- మధ్యాహ్నం 3:00 గంటలకు సీఎంను నాయకులు సన్మానించారు.
- 4:20 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన రేవంత్‌రెడ్డి 5:00 గంటలకు ముగించారు.

90 శాతం పూర్తయిన గాలికుంటు టీకాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను 90 శాతం మేర వేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు కలిపి 2.60లక్షల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 2.40లక్షల టీకాలు వేశామన్నారు. మిగతా పశువులకు నెలాఖరు నాటికి టీకాలు వేస్తామన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని ఆయన కోరారు. ఇక నుంచి గేదెలు, ఆవులకు ప్రతి ఆరు నెలలకోసారి గాలికుంటు నివారణ టీకాలు తప్పకుండా వేస్తామన్నారు.

క్రైం కార్నర్

గంజాయి మత్తులో కత్తితో దాడి

ఖలీల్‌వాడి: గంజాయి మత్తులో ఉన్న ఓ వ్యక్తి మరో వ్యక్తి గొంతుపై కత్తితో పొడిచినట్లు ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రమేశ్ తెలిపారు. అర్సపల్లి పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద సోమవారం ఈ ఘటన చోటుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి మత్తులో ఉన్న అక్రమ్‌ఖాన్ పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని ఫిరోజ్‌ఖాన్ అనే వ్యక్తి గొంతుపై కత్తితో పొడిచాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పేట్‌సంగెం గ్రామానికి చెందిన సాలె కిషన్(50) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన కిషన్‌ను బైక్ ఢీకొట్టడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారన్నారు. కిషన్ సోమవారం ఉదయం మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బాన్సువాడ : పట్టణంలోని కల్కి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. సోమవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని జాలర్ల సాయంతో బయటికి తీయించి ఆస్పత్రికి తరలించామన్నారు.

కుంటలో మరో మృతదేహం..

ఎడపల్లి(బోధన్): మండలంలోని శాటాపూర్ గేట్ వద్ద ఉన్న కుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు. నలుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

నవీపేట: పిడుగుపాటు కారణంగా మండలంలోని మోకాన్‌పల్లిలో ఆవు మృతి చెందింది. మిర్యాల ఒడ్డెన్నకు చెందిన ఆవు సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందిందని, దాని విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మోతెలో విద్యుత్‌షాక్‌తో..

వేల్పూర్: మండలంలోని మోతెలో విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందింది. ఉరడి నవీన్ అనే రైతుకు చెందిన సోమవారం ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో మేతమేస్తుండగా షాక్ తగిలి మృతి చెందిందని మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పీఆర్ ఏఈకి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పీఆర్ ఏఈ పిచ్చయ్యకు రోడ్డు ప్రమాదంలో గాయాలైనట్లు స్థానికులు సోమవారం తెలిపారు. నాగిరెడ్డిపేట కార్యాలయంలో విధులను ముగించుకుని మెదక్‌కు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టిందని, ఈ ఘటనలో పిచ్చయ్యకు తీవ్రగాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం బాధితుడిని మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో..

ఎడపల్లి (బోధన్): మండలంలోని అలీసాగర్ లిఫ్ట్ ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు మహిళలు నిజామాబాద్ నుంచి బోధన్ వైపు స్కూటీపై వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం స్థానికులు నిజామాబాద్‌కు తరలించారు.

హనుమాన్ శోభాయాత్ర.. ట్రాఫిక్ మళ్లింపు

- నేడు నగరంలో 1200 వందల మందితో బందోబస్తు
- సీసీ టీవీలు, డ్రోన్ కెమెరాలతో నిఘా

ఖలీల్‌వాడి: నగరంలో నేడు హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు గమనించి సహకరించాలని ఆయన తెలిపారు.

శోభాయాత్ర సాగేదిలా..

హనుమాన్ శోభాయాత్ర కంఠేశ్వర్ ఆలయం నుంచి జిల్లా పరిషత్ చౌరస్తా హమాల్‌వాడీ, పాత ప్రభాత్ టాకీస్, లలితామహల్ రైల్వేగేట్, గంజ్ గేటు నెంబర్ 2 గోదాం రోడ్డు, దేవి రోడ్డు, మమతా సర్కిల్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్ , ఆజాం రోడ్డు పెద్ద పోస్టాఫీస్, పెద్దబజార్, లక్ష్మీ మెడికల్, పోతలింగన్న ఆలయం, మీదుగా రాజరాజేంద్ర చౌరస్తా వరకు చేరుకుంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని దుకాణాల యాజమానులు, నివాసం ఉండేవారు, వాహనదారులు శోభాయాత్ర వెళ్లే మార్గంలో రోడ్లపై పార్కింగ్ చేయరాదన్నారు.

వాహనాల మళ్లింపు ఇలా..

- హైదరాబాద్ నుంచి: ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్ మీదుగా మాధవనగర్ బైపాస్ చేరుకోవాలి.
- బోధన్ నుంచి: అర్సపల్లి రైల్వే గేట్ నుంచి కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, నీలకంఠేశ్వర్ ఆలయం , ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు సర్కిల్, రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.
- బాన్సువాడ నుంచి: వర్ని చౌరస్తా నుంచి పులాంగ్ సర్కిల్ కోర్టు సర్కిల్ ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్ చేరుకోవాలి.
- ఆర్మూర్ నుంచి: కంఠేశ్వర్ బైపాస్, కంఠేశ్వర్ ఆలయం, ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు సర్కిల్, గ్లామర్, రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.

నాలుగు జిల్లాల పోలీసు సిబ్బంది..

నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో జరిగే హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఈ శోభాయాత్రకు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డులు మొత్తం 1200 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, ములుగు, సిద్దిపేట్ జిల్లాల పోలీసులు ఈ బందోబస్తు విధుల్లో పాల్గొంటారన్నారు. శోభాయాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పకడ్బందీగా నిఘా పెట్టినట్లు తెలిపారు. పోలీసుశాఖతో పాటు ఇతర డిపార్ట్‌మెంట్‌ల సహకారం తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు వైన్స్, బార్లు, కల్లు డిపోలు మూసివేత

నేడు జిల్లాలోని వైన్స్‌లు, బార్లు, కల్లుడిపోలు హనుమాన్ జయంతి సందర్భంగా మూసివేసినట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి బుధవారం ఉదయం 6గంటలకు వరకు మూసివేయాలని తెలిపారు. మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిజామాబాద్ ఎంపీ స్థానం సంఖ్య '4'

- గతంలోని క్రమ సంఖ్య 34
- పునర్విభజనతో మారిన నంబర్



మోర్తాడ్(బాల్కొండ): వాహనాలను రిజిస్ట్రేషన్ చేస్తే నంబర్లను కేటాయిస్తారు, విద్యార్థులు స్కూల్, కళాశాలల్లో అడ్మిషన్ తీసుకుంటే అడ్మిషన్ నంబర్ ఇస్తారు. అలాగే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు కూడా క్రమ సంఖ్య అంటూ ఒకటి ఉంటుంది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం క్రమ సంఖ్యను 4గా ఎన్నికల కమిషన్ గుర్తించింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పటి వరకు నిజామాబాద్ స్థానం సంఖ్య 34గా పరిగణించారు. పునర్విభజన అనంతరం నిజామాబాద్ పార్లమెంట్‌నియోజకవర్గం సంఖ్య సింగిల్ డిజిట్‌లోకి మారింది. 1957లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానం ఆవిర్భవించిన సమయంలో అప్పుడు కేటాయించిన సంఖ్య 29గా ఉండేది. 1962లో నియోజకవర్గాల పునర్విభజన జరగగా అప్పుడు 35గా నమోదైంది. 1967లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో క్రమ సంఖ్యను 34 కాగా, 2004 వరకు అందే సంఖ్య కొనసాగింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో క్రమ సంఖ్య సింగిల్ డిజిట్‌లోకి మారింది. ఉమ్మడి రాష్ట్రంలోనే నిజామాబాద్ ఎంపీ స్థానం సంఖ్య 4గా ఉండగా తెలంగాణ ఆవిర్భావం తరువాత కూడా ఇదే సంఖ్యను లెక్కలోకి తీసుకున్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితేనే క్రమ సంఖ్య మారే అవకాశం ఉంటుందని ఎన్నికల అధికార యంత్రాంగం తెలిపింది.

ఆర్టీసీ డ్రైవర్‌పై ఉపాధ్యాయుడి దాడి


దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్


రోదిస్తున్న మహిళా కండక్టర్

- బస్సు ఆపనందుకు పిడిగుద్దులు
- అడ్డు వచ్చిన మహిళా కండక్టర్‌పై బూతుపురాణం
- నిందితుడిపై చేయి చేసుకున్న ప్రయాణికులు

కామారెడ్డి టౌన్: ఆపమన్న చోట బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిడిగుద్దులతో దాడి చేసిన ఘటన సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ నుంచి కామారెడ్డి రూట్ ఆర్టీసీ బస్సులో ఐండ్ల శ్రీనివాస్ డ్రైవర్‌గా, కండక్టర్‌గా విమల విధులు నిర్వహిస్తున్నారు. అదే బస్సులో ప్రయాణించిన సదాశివనగర్ మండలం యాచారం తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లకావత్ శ్రీనివాస్ కామారెడ్డి పట్టణ సమీపంలోని పాత కలెక్టరేట్ వద్ద బస్సు ఆపాలని కండక్టర్‌ను కోరాడు. కొంచం ముందుకు వెళ్లాక బస్సు ఆపడంతో ఆగ్రహంతో ఉపాధ్యాయుడు ప్రయాణికుల చూస్తుండగా డ్రైవర్‌పై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేసాడు. అడ్డు వచ్చిన మహిళ కండక్టర్‌ను బూతు పురాణంతో దూషించాడు. ప్రయాణి కులు అడ్డువచ్చినా వినలేదు. దీంతో డ్రైవర్ అలాగే బస్సును కామారెడ్డి బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రయాణికులంతా దాడి చేసిన వ్యక్తిని బస్టాండ్‌లో నిలదీసారు. తప్పంతా నీదేనని కొంద రు ప్రయాణికులు ఆ టీచర్‌పై చేయి చేసుకున్నారు. తనను అనరాని మాటలతో దూషించాడని మహిళ కండక్టర్ రోదిస్తూ ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దాడి చేసిన వ్యక్తి గాంధారి మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రాయిని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

- ఆరబోసిన ధాన్యం కుప్ప వద్ద ఘటన

నవీపేట: రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పపక్కన పెట్టిన రాయిని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. నవీపేట-నాగేపూర్ మధ్య బాసర రోడ్డుపై ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగేపూర్‌కు చెందిన నేతి సాయిలు(40) తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై నవీపేటకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పకు అడ్డుగా పెట్టిన రాయిని ఢీకొట్టి బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు స్నేహితులు ఘటనాస్థలం నుంచి పరారయ్యారు. మృతుడికి భార్య వసంత, ఆరేళ్ల కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కామారెడ్డి క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో తాడ్వాయికి చెందిన మర్రి సాయిలు(40) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రం పరిధిలోని పొందుర్తి శివారులో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయిలు పని నిమిత్తం ఆదివారం సాయంత్రం బైక్‌పై భిక్కనూరుకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తుండగా, పొందుర్తి సమీపంలోని లక్ష్మీనగర్‌తండా వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

డిచ్‌పల్లి: ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం సాయంత్రం బోల్తాపడింది. ఓవర్ లోడ్ కారణంగా లారీ ఎడమవైపు ఒరిగి బోల్తాపడింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న వారిపై ధాన్యం బస్తాలు పడకపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ అద్దాన్ని పగులగొట్టుకుని క్యాబిన్‌లో నుంచి బయటకు వచ్చాడు. సిరికొండ మండలం చీమన్‌పల్లిలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వడ్ల బస్తాలను లోడ్ చేసుకుని నిజామాబాద్ శివారులోని రైస్‌మిల్లుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సీఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తులో ఉన్న పోలీసులు సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు. ఐడీసీఎంఎస్ సిబ్బందితో మాట్లాడి మరో లారీని రప్పించి ధాన్యం బస్తాలను తరలించారు.


రైల్వే స్టేషన్ ఎదుట బోల్తా పడిన లారీ